క్లుప్తంగా

ప్లేట్లు, విద్యాసామగ్రి వితరణ



ఉపాధ్యాయులకు ప్లేట్లు అందజేస్తున్న దాత పార్థసారథి

వంగర: పటువర్ధనం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రాజాం పట్టణానికి చెందిన సామాజిక వేత్త కొల్లా పార్థసారథి భోజనం ప్లేట్లు, గ్లాసులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, తదితర సామగ్రిని గురువారం అందజేశారు. దాతకు హెచ్ఎం లెంక రామకృష్ణ, ఉపాధ్యాయులు జయరాజు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ



విద్యార్థులకు ఐడీకార్డులు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన పాలవలస తరుణ్ అనే ఇంజినీర్ ఉద్యోగి ఐడీ కార్డులు సమకూర్చారు. వీటిని ఎంఈఓలు బి.ప్రవీణ్ కుమార్, యాగాటి దుర్గారావు విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓలు మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

వంగర: ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బంగారువలస గ్రామ సెవెంత్–డే అడ్వెంటిస్ట్ చర్చి పాస్టర్ కె.డేవిడ్‌పాల్ అన్నారు. బాల్య వివాహాలు, లింగ వివక్షకు వ్యతిరేకంగా, బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ బంగారువలసలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆడ పిల్లలపై వివక్ష చూపకుండా మగపిల్లలతో సమానంగా చదివించాలని, మహిళలను గౌరవించాలని అన్నారు. స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిలువరించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. పలువురు క్రైస్తవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి, ఏఓ గోకుల్‌కృష్ణ

మెంటాడ: రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా సంబంధిత దుకాణ నిర్వాహకులపై చర్యలు తప్పవని తహసీల్దార్ అరుణకుమారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని, చల్లపేటలోని ఎరువుల దుకాణాల్లో ఏఓ గోకుల్‌కృష్ణతో కలిసి తహసీల్దార్ శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దుకాణాల వద్ద ఎరువులు, పురుగు మందుల స్టాక్, ధరల వివరాలతో బోర్డులు ప్రదర్శించాలని సూచించారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపం



సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై ఆపార్టీ నాయకులు శనివారం సంతాపం తెలిపారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక జెండామహల్ జంక్షన్‌వద్ద సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. సీపీఐ నాయకులు వెంకట సత్యనారాయణ,తమటాల అప్పలనాయుడు, సత్యం,తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల ఊసేలేదు..!

- ఎక్కడికక్కడే అధ్వాన్నంగా రోడ్లు
- రోడ్ల పునరుద్ధరణ అంటూ పలుచోట్ల తవ్వి వదిలేశారు
- కొన్ని గ్రామాల రోడ్లను పూర్తిగా విస్మరించిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రాజాం మండలం పెనుబాక వద్ద గోతులతో ప్రధాన రహదారి

రాజాం: సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను చూస్తారని సీఎం చంద్రబాబునాయుడు గొప్పగా ప్రకటనలు చేశారు. సంక్రాంతి పండగ వెళ్లిపోయి ఎనిమిది నెలలు కావస్తున్నా ఎక్కడా రోడ్లు బాగుపడలేదు. గత ప్రభుత్వం కేటాయించిన నిధులతో తూతూ మంత్రంగా రెండుమూడుచోట్ల రోడ్ల నిర్మాణం, మరమ్మతులు జరగగా, వాటిని కూటమి నేతలు తమ ఖాతాలో వేసుకున్నారు. అక్కడితోనే వాటి పని ముగిసింది. ఇప్పటివరకూ కొత్త రోడ్ల నిర్మాణం జరగకపోగా, గతంలో హామీ ఇచ్చిన మేరకు పాత రోడ్లకు మర్మతులు, పునరుద్ధరణ జరగలేదు. పలుచోట్ల రహదారి నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేయగా, మరికొన్నిచోట్ల గుంతలు, రాళ్లు తేలిన రోడ్లు కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల రోడ్లు ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి.

కన్నెత్తి చూడడంలేదు

రాజాం నియోజకవర్గంలో పలు గ్రామాల రహదారులు ప్రమాదకరంగా మారాయి. రాజాం నుంచి చీపురుపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో పెనుబాక, బొద్దాం గ్రామాల వద్ద రోడ్డు గోతులు తేలింది. ఇక్కడ ఆటోలు ఫల్టీలు కొడుతున్నాయి. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాజాం మండలంలో సి.ఎస్.ఆర్.పురం, పెనుబాక–శ్యాంపురం, పొగిరి–నందబలగ, అంతకాపల్లి–వి.ఆర్.అగ్రహారం గ్రామాల రోడ్లు ఎక్కడికక్కడ గోతులతో దర్శనమిస్తున్నాయి. వంగర మండలంలో బాగేంపేట రహదారి దారుణంగా మారింది. వంగర నుంచి కొత్తవలస వెళ్లే రహదారిలో రోడ్డంతా భయానకంగా మారింది. రేగిడి మండలంలో సోమరాజుపేట, ఖండ్యాం, అంబఖండి ప్రాంతాల రహదారి గోతులతో ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. రాజాం నుంచి పాలకొండ వెళ్లే ప్రధాన రహదారి ఉంగరాడమెట్ట, మజ్జిరాముడు పేట, సంకిలి ప్రాంతాల్లో వాహనచోదకులు, ప్రయాణికులకు చుక్కలు చూపిస్తుంది. సంతకవిటి మండలంలో మిర్తివలస–మండాకురిటి, సంతకవిటి– కె.ఆర్.పురం గ్రామాల మధ్య రహదారి నిర్మాణం నిమిత్తం పాత రోడ్డును తవ్వేసి వదిలేశారు. సంతకవిటి నుంచి పొందూరు వెళ్లే రహదారి విస్తరణ చేపడతామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కూటమి ఇప్పుడు ఆ ప్రసక్తే లేకుండా ఊటకాయిస్తుంది. మందరాడ–గోవిందపురం గ్రామాల మధ్య రోడ్డు పునరుద్ధరణకు గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. అయితే అప్పటిలో పనులు చేయలేదు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ఈ రోడ్డువైపు కన్నెత్తి చూడడం లేదు.



రేగిడి మండలం సోమరాజుపేట వద్ద ప్రమాదకరంగా రోడ్డు



సంతకవిటి మండలం జావాం వద్ద రోడ్డు పునరుద్ధరణలో భాగంగా సిప్స్ వేసి వదిలేసిన దృశ్యం

తవ్వి వదిలేశారు



మా గ్రామానికి సంతకవిటి నుంచి రోడ్డు నిర్మాణం నిమిత్తం నాలుగు నెలల క్రితం పాత రోడ్డును తవ్వేశారు. కొత్తగా సిప్స్ వేసి వదిలేశారు. బీటీ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో రోడ్డు రాళ్లు తేలుతున్నాయి. ఇసుక లారీలు అధికంగా తిరుగుతుండడంతో రోడ్డు గోతులు తేలుతోంది. – బోనెల ప్రసాద్, సర్పంచ్, జావాం, సంతకవిటి

ప్రమాదకరంగా మారింది



మా గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిని బాగుచేయాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మా గ్రామం నుంచి శ్యాంపురం వెళ్లే గ్రావెల్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని చెప్పి పనులు ప్రారంభించి వదిలేశారు. – బండి నర్శింహులు, జెడ్పీటీసీ, పెనుబాక గ్రామం, రాజాం మండలం

రాకపోకలు నిలిచిపోయాయి



మా గ్రామం నుంచి మందరాడకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు బీటీ రోడ్డు నిర్మాణం పేరుతో పాత రోడ్డు తవ్వి వదిలేశారు. రాళ్ల పోగులు గుట్టలుగా మారి ప్రమాదకరంగా మారింది. పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు ఎప్పుడు వేస్తారో తెలియడంలేదు. – రాగోలు రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్, గోవిందపురం, సంతకవిటి మండలం

ఒకేసారి నాలుగు పోస్టులకు అర్హత



బూరి తవిటి నాయుడు

తెర్లాం: మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన బూరి తవిటినాయుడు లింగాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 2025 డీఎస్సీ పరీక్షలు రాశారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో ఈయన నాలుగు కేటగిరీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారు.స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో స్టేట్ 11వ ర్యాంక్, జిల్లాలో 5వ ర్యాంక్‌సాధించాడు. పీజీటీ సివిక్స్ స్టేట్ 3వ ర్యాంక్, పీజీటీ సోషల్‌లో 8వ ర్యాంక్‌ను, టీజీటీలో 19వ ర్యాంక్ సాధించాడు.

సత్తాచాటిన శ్రీనివాసరావు



అలజంగి శ్రీనివాసరావు

తెర్లాం మండలంలోని వెలగవలస గ్రామానికి చెందిన అలజింగి శ్రీనివాసరావు డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ మూడు కేటగిరిల్లో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యాడు.

ప్రతిభ కనబరిచిన ఉమామహేశ్వరి



ఉమామహేశ్వరి

తెర్లాం మండలంలోని అంట్లవార గ్రామానికి చెందిన రెడ్డి ఉమామహేశ్వరి డీఎస్సీ ఫలితాల్లో మూడు పోస్టులకు అర్హత సాధించింది. పీడీ(గురుకులం), స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్–పీఈటీ కేటగిరిల్లో ఉద్యోగాలకు అర్హత సాధించింది. ఈమె భర్త గుల్లిపల్లి మురళీకృష్ణ వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు



దూబ హరికృష్ణ

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన దూబ హరికృష్ణ డీఎస్సీలో మూడు కేటగిరిల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 90.5 మార్కులతో స్కూల్ అసిస్టెంట్‌గా శ్రీకాకుళం జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు. ఫిజికల్ డైరెక్టర్‌కు 84.5 మార్కులతో మొదటి జోన్‌లో 3వ ర్యాంకు సాధించాడు. పీఈటీకి 86 మార్కులతో మొదటి జోన్‌లో 9వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు.

రెండు పోస్టులకు అర్హత



మజ్జి అన్నాజీరావు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం గ్రామానికి చెందిన మజ్జి అన్నాజీరావు డీఎస్సీ ఫలితాల్లో రెండు కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్, టీజీటీ విభాగంలో అర్హత సాధించాడు. గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి

వంగర: గ్రామాల్లో స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ సర్వేయర్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన సర్వేపై ఆరా తీశారు. సర్వే పెండింగ్‌కు కారణాలను తెలుసుకున్నారు.సర్వే వివరాలను తక్షణమే కంప్యూటరీకరించాలని చెప్పారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో త్రైత సిద్ధాంతప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం శాఖ నిర్వహిస్తు న్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించి ఈ పోటీల్లో రాజాం పట్టణం, పలుగ్రామాలకు చెందిన విద్యా ర్థులు పాల్గొన్నారు. వీరిలో రాజాం ఈశ్వరనారాయణకాలనీకి చెందిన పదోతరగతి విద్యార్థిని వారణాశి లక్ష్మి ప్రథమ స్థానంలో నిలవగా, ఎనిమిదవ తరగతికి చెందిన నిహారిక ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి నిర్వాహకులు బహుమ తు లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక సభ్యులు రామినాయుడు, మోహనరావు, గణపతిరావు, రామకృష్ణ, కృష్ణారావు, అప్పలనరసయ్య, పారంనాయుడు, భాస్కరరావు, సూరప్పనాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎంఈఓ ప్రవీణ్‌కుమార్

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎం.జె.వలస ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ముందుగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, వారి నోట్ పుస్తకాలు పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

ఆదర్శప్రాయుడు టంగుటూరి



ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ జగన్ మోహనరావు, ఎంపీడీఓ నాగమణి



బొబ్బిలిరూరల్: బొబ్బిలి ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీడీఓ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ, తదితరులు



తెర్లాం: శాఖా గ్రంథాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు



వంగర: ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి, సిబ్బంది

రేగిడి/ వంగర: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శ ప్రాయుడని టంగుటూరి ప్రకాశంపంతులు ఆదర్శ ప్రాయుడని రేగిడి వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్ మోహనరావు, ఎంపీడీఓ నాగమణి, వంగర ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు.రేగిడి, వంగర మండల పరిషత్ కార్యాలయాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి వైస్ ఎంపీపీ, ఎంపీడీఓలు, కార్యాలయాల సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెర్లాం గ్రంథాలయంలో..

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని లైబ్రేరియన్ సీహెచ్. కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టంగుటూరి చిత్రపటానికి లైబ్రేరియన్, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొబ్బిలిలో...

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి డీడీఓ ఎం.కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పి.కిరణ్‌కుమార్ డిప్యూటీ ఎంపీడీఓ భాస్కరరావు,ఉపాధిహామీ ఏపీఎం లక్ష్మీపతిరాజు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మట్టి గణపతినే పూజిద్దాం..



పర్యావరణ హితం వినాయక చవితి ఉత్సవాలకు మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలనే పూజిద్దామని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జె.సి.రాజు అన్నారు.రామభద్రపురం మండలంలోని నాయుడువలస సచివాలయం వద్ద ప్రజలకు,సచివాలయ ఉద్యోగులకు, విద్యార్థులకు శనివారం సుమారు 300 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె.సి.రాజు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో కూడిన రంగులతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జలకాలుష్యమవుతుందని, నీటిలో ఉన్న ప్రాణులు, ఆ నీటిని తాగే పశువులు, వినియోగించే మనుషులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. – రామభద్రపురం

సాగు పట్టాల కోసం ఆందోళన



మెంటాడ మండలంలో దళితులు,గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు,అటవీ భూములకు పట్టాలివ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం, వ్యవసాయ,కార్మిక, గిరిజన సంఘాల నాయకులు జి.శ్రీనివాస్,రాకోటి రాములు,పెదరాము అప్పారావు, సన్యాసమ్మ, వీరమ్మ, గౌరీశ్వరరావు డిమాండ్ చేశారు. బొబ్బిలిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద మెంటాడ మండలానికి చెందిన గిరిజనులు, దళితులు శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ తరతరాలు రిజర్వ్ ఫారెస్టు భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వడం లేదని, కానీ మెంటాడ మండలంలో గిరిజనులు సాగుచేసుకుంటున్న అటవీ భూములను బండారు సంజీవరావు అనే వ్యక్తి జిరాయితీ భూములుగా చూపి రిజిస్ట్రేషన్ చేయించుకు న్నారని ఆరోపించారు. ఆగూరులో 57 ఎకరాల భూమి రిజర్వ్ ఫారెస్టులో ఉందని, ఆభూమిని గుడ్డివలస, ఎర్రగడ్డవలస, పనుకువానివలస, సెడగంవలస గ్రామాలకు చెందిన 80 గిరిజన కుటుంబాల వారికి పట్టాలివ్వాలని ఆర్డీఓను కోరామని చెప్పారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి గిరిజనులకు పట్టాలిప్పించాలని కోరారు. – బొబ్బిలి

1న చలో విజయవాడ



సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీసీపీఎస్‌ఈఏ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన శ్రీనివాసరావు చెప్పారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయ ఆవర ణలో చలో విజయవాడ వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం సాధించేవరకు పోరాటం చేస్తామని చెప్పారు. సీపీఎస్‌ఈఏ మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి పైడుపు నాయుడు, తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న శంబంగి

బొబ్బిలి: అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెప్పడం, అధికారం దక్కాక మోసం చేయడంలో సీఎం చంద్రబాబు నాయుడు దిట్ట అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి పట్టణంలోని 18వ వార్డులో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం శనివారం నిర్వహించారు. శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు వార్డులో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా శంబంగి మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిలో ఏ ఒక్క పథ కాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నాడని అన్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వకపోగా, లక్షల మంది దివ్యాంగులకు పింఛన్ నిలిపివేసిందని, వారి ఉసురు తగలకు మానదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణ, తూముల భాస్కరరావు, నాయకుడు ఇంటి గోపాలరావు, వివిధ వార్డుల ఇన్‌చార్జ్‌లు బుడి ఆనంద్, బుడి రాజా,అన్వర్ భాషా తదితరులుపాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్

వంగర: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలని ఎస్‌ఐ షేక్ శంకర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో శనివారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్ వంటి అంశా లపై గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. వినాయక మండపాలకు అనుమతి తీసుకునే విధానాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు వివరించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, ఎవరైనా అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడినా తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



తెర్లాం: ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ రాంబాబు, తదితరులు



రేగిడి: ఖండ్యాం పాఠశాల ఆవరణలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని, పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అధికారు లు, ప్రజాప్రతినిధులు అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో శనివారం 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు, చెత్త తొలగించడంతో పాటు మొక్కలు నాటారు. – సాక్షి నెట్‌వర్క్